క్లుప్తంగా

లూయిస్ బ్రెయిలీ జయంతి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలోని వికాసం దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. బ్రెయిలీలో చదవడం, వ్రాయడం మీద పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంద విద్యార్థులకు బ్రెయిలీ లిపీ నేర్పిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో వికాసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వికాస్, అధ్యాపకులు నరేశ్, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయండి

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తే ఫిర్యాదు చేయాలని మహిళ సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్న మహిళలకు అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని జనశిక్షణ సంస్థాన్ సభ్యురాలు కృష్ణవేణి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మివాడలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. లింగ వివక్ష, సుకన్య యోజన, మహిళ సాధికారత, సమానత్వం తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో శిక్షకురాలు అరుణ, అంజలి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

బోథ్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో చేరేందుకు నాలుగో తరగతి విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత కోరారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురుకులం వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు ఈనెల 6వ తేదీ చివరిదన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా గురుకులలో బోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, సంతోష్, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తేజాపూర్‌లో 'ప్రజాపాలన'

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు బేల, జైనథ్ కమిటీల నియామకం

ఆదిలాబాద్‌రూరల్: సమాజ ఐక్యత, అభివృద్ధిలో భాగంగా శనివారం బేల, జైనథ్ మండలాల ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కమిటీలను నియమించడం జరుగుతుందని ఆ సమాజ్ జిల్లా అడహక్ కమిటీ సభ్యులు పూసం ఆనంద్ రావ్, నైతం శుక్లాల్, పూసం ప్రభాకర్, సుభాష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు బేల, మధ్యాహ్నం 2 గంటలకు జైనథ్ మండల కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ పెద్దలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యువత, మహిళలు పాల్గొనాలని కోరారు.

'మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి'

ఇచ్చోడ: అవినీతికి పాల్పడుతున్న ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిలక దేవిదాస్, సహాయ కార్యదర్శి సిర్ర దేవెందర్‌లు డిమాండ్ చేశారు. గురువారం మార్కెట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రమేశ్ కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ కార్యదర్శి రమేశ్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తాంసి: తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కార్యాలయంలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్ రెడ్డి, ఆడే గజేందర్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో భీంపూర్ మండలానికి చెందిన సీనియర్ నాయకుడు క్లైం శ్రీనివాస్ రెడ్డి, వినోద్ యాదవ్, తాంసి మండలానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, లింగారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

చేనులోనే తెల్లబంగారం

- పత్తి సేకరణకు దొరకని కూలీలు
- నియోజకవర్గంలో 83వేల ఎకరాల్లో సాగు


చేనులో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి పంట

ఆదిలాబాద్‌రూరల్: గత ఏడాది వానాకాలం కంటే ఈవానాకాలంలో పత్తి సాగు పెరిగింది. ఏక కాలంలో పత్తి పంట కోతకు రావడంతో మండల వ్యాప్తంగా వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉంది. పగిలిన పత్తిని వారం, పది రోజులకు తీయాలి. కూలీల కొరత కారణంగా నెల రోజుల పాటు పత్తిని వ్యవసాయ పొలంలోనే ఉంటుంది. ఇదిలా ఉండగా ఒక్కొక్క పత్తి బుగ్గలో 6 నుంచి 8 పత్తి గింజలు ఉంటాయి. ఒక్కొక్క పత్తి బుగ్గ బరువు 5 గ్రాముల నుంచి 6 గ్రాముల బరువు ఉంటుంది. పత్తి పిక్కింగ్ (తీయకపోవడంతో) సకాలంలో చేయకపోవడంతో పత్తి గింజలోని నూనె శాతం తగ్గడంతో పాటు దూది బరువు తగ్గుతుంది. చేనులోనే పత్తి ఎండిపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

క్వింటాల్‌కు 15 కిలోల వరకు..

ఆదిలాబాద్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 85 వేల ఎకరాలలో పత్తి సాగవుతుంది. పత్తి ఏక కాలంలో కోతకు రావడంతో కూలీల కొరత ఏర్పడింది. పత్తి ఏరినందుకు కిలోకు రూ. 7 నుంచి రూ. 8 కూలీ అందజేస్తున్నారు. కూలీ ఎంత పత్తి ఎరితే అంతా కూలీ చెల్లిస్తారు. పత్తి పంటను సకాలంలో పిక్కింగ్ చేయకపోవడంతో తేమ శాతం తగ్గి క్వింటాల్‌కు 10 కిలోల నుంచి 15 కిలోల వరకు బరువు తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలస కూలీలు తగ్గారు..

ప్రతీ వానాకాలం సీజన్‌లో మహారాష్ట్ర నుంచి కూలీలు నియోజవర్గంలోని మండలాలకు వస్తారు. ఈఏడాది వలస కూలీల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో కూలీల కొరత వేధిస్తోంది,. వ్యవసాయ పొలంలోని పత్తిని సకాలంలో పిక్కింగ్ చేయకపోవడంతో పత్తి బరువు తగ్గుతుంది. దీంతో వ్యవసాయ పొలంలోనే నెల రోజుల పాటు పత్తి ఉండి పోయి దెబ్బతింటుంది. దీంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పిక్కింగ్ చివరి దశకు చేరుకుంది

మొదటి దశలో కాయ సైజు పెద్దగా ఉంటుంది. ప్రస్తుతం కొన్ని వ్యవసాయ పొలంలో చివరి దశ పత్తి పిక్కింగ్‌కు చేరుకుంది. నీటి వసతి లేని ప్రాంతాల్లో పత్తి బరువు తగ్గుతోంది. నీటి సౌకర్యం ఉన్న వాటిలో పత్తి బరువు పెరుగుతుంది. – అష్రఫ్, వ్యవసాయాధికారి, ఆదిలాబాద్ రూరల్

ఉన్నతమైన ఆలోచనలతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇచ్చోడ: విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల్లో నిర్వహిస్తున్న ఇగ్నైట్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గిరిజన విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం మైనార్టీ, గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాలు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్సీవో గంగాధర్, ఎంపీపీ ప్రీతం రెడ్డి, జెడ్పీటీసీ సుభద్రబాయి, ఏనుగు కృష్ణారెడ్డి, గాడ్గే సుభాష్, సర్పంచ్ చౌహన్ సునీత, ప్రిన్సిపాల్స్ రాజేంద్రప్రసాద్, రత్నకుమారిలు పాల్గొన్నారు.

అలరించిన ఇగ్నైట్ ఫెస్ట్..

గత రెండు రోజుల నుంచి ఇచ్చోడలో నిర్వహిస్తున్న రీజినల్ లెవల్ ఇగ్నైట్ ఫెస్ట్ ఆలరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 గిరిజన గురుకులాల పాఠశాలల నుంచి 1414 మంది విద్యార్థులు 24 పోటీలలో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే యూత్ పార్లమెంట్ ఆకట్టుకుంది. విద్యార్థులు పార్లమెంట్ సభ్యులుగా మారి ప్రసగించారు.

రిమ్స్ డైరెక్టర్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం (ఐఎన్‌టీయూసీ) నాయకులు గురువారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సంతోష్ కుమార్, సలహాదారులు బాబులాల్ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, కోశాధికారి ఆడె సురేశ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గురువారం టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జలేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ ప్రత్యేక కార్యచరణతో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రఫుల్ చందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు రమణరెడ్డి, ప్రహ్లద్, రమణరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు.

'ఉజ్వలయోజన'తో ఉచిత గ్యాస్ కనెక్షన్


గ్యాస్ స్టవ్, సిలిండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఉజ్వల యోజన పథకంతో మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఉజ్వల యోజన లబ్ధిదారులకు గ్యాస్ పొయ్యి, సిలిండర్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉజ్వల యోజన పథకం కేంద్ర ప్రభుత్వం ప్రధాన పథకాలలో ఒకటన్నారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన పేదవర్గాల మహిళలకు సిలిండర్ అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. మహిళలు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని సెకండ్ ఏఎన్ఎంలు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిశారు. గురువారం జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రారంభమైనప్పటి నుంచి ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రెగ్యులరైజ్ చేసే విధంగా చూడాలని చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సుజాత, పుష్పలత, జానబాయి, లత, నఫీజ, ప్రమిళ, తదితరులు ఉన్నారు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సవాయ్‌సింగ్


మాట్లాడుతున్న ఎంపీడీవో పుష్పలత

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పుష్పలత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రజాపాలన గ్రామ సభను నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకొని దరఖాస్తు చేసుకున్నారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ ప్రజాపాలన గ్రామసభను పర్యవేక్షణ చేశారు. ప్రజలు ఎలాంటి ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు అందించే విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోబాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, సర్పంచ్ కోరెంగా గాంధారి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్ పాల్గొన్నారు.

బోథ్: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ మండల వ్యాప్తంగా కొనసాగుతోంది. గురువారం సొనాల, కుచులాపూర్, కోట(కె) గ్రామాల్లో ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీవో జీవన్‌రెడ్డిలు దరఖాస్తులను స్వీకరించారు. బోథ్‌లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కేసులు నమోదైన వెంకట రమణ గౌడ్, దేవిదాస్‌లు గ్రామ పంచాయతీలో దరఖాస్తులు అందజేశారు. సొనాలలో ఉద్యమకారుడు షేక్ మహిమూద్ దరఖాస్తు చేసుకున్నాడు.

బేల: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి 1,476 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం 180 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఉమర్, సర్పంచ్ ఇంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి గట్లెవార్ గజానన్, కారోబారి గజానన్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రజాపాలన దరఖాస్తులకు అనూహ్య స్పందన వస్తోందని తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌లు అన్నారు. గురువారం మండలంలోని చిన్నబుగ్గారం, రోల్‌మామడ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తును స్వీకరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండలంలోని బండల్‌నాగాపూర్‌లో రూ.12 కోట్ల నిధులతో చేపట్టే రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పొచ్చర నుంచి కప్పర్ల, బండల్‌నాగాపూర్ నుంచి వడ్డాడి, సావర్గాం నుంచి బండల్‌నాగాపూర్ నిర్మించే రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతీగ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనను కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో తాంసి జెడ్పీటీసీ రాజు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సదానంద్, పార్టీ కన్వీనర్ అరుణ్, మార్కెట్ డైరెక్టర్ మహేందర్, సర్పంచ్ వెంకన్న, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ తీరు పరిశీలన

భీంపూర్ మండల కేంద్రంలో ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ తీరును ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దరఖాస్తుల స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ధనోర గ్రామానికి చెందిన గోప రాజన్న ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, తాంసి జెడ్పీటీసీ రాజు, పార్టీ కన్వీనర్ నాగయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

అయోధ్య అక్షింతలతో ఊరేగింపు


అక్షింతలను తీసుకెళ్తున్న దూబార్‌పేట్ గ్రామస్తులు

ఇచ్చోడ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రం నుంచి అయోధ్య అక్షింతలను దూబార్‌పేట్‌కు తీసుకెళ్లారు. మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికి పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు పిల్లి నరేశ్, ప్రఖండ కార్యదర్శి గెడం నగేందర్, జిల్లా కార్యదర్శి సంతోష్, గ్రామస్తులు కాల్లె విఠల్, శంకర్ పాల్గొన్నారు.

బోథ్‌కు చేరుకున్న అక్షింతలు

బోథ్: అయోధ్య రామయ్య అక్షింతలు, కరపత్రాలు గురువారం బోథ్‌కు చేరుకున్నాయి. శనివారం నుంచి బోథ్ పట్టణంలోని గడప గడపకూ పంపిణీ చేస్తామని భజరంగ్ దళ్ జిల్లా సహాయ కార్యదర్శి పాలిక్ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో రాము, నవీన్ రెడ్డి, వేముల కిష్టయ్య, అనిల్ కుమార్, నోముల కుశాల్ రెడ్డి, తాటికొండ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూలో ఏఐఎస్ఎఫ్ నాయకుల చేరిక


కండువాను కప్పుతున్న రాజేశ్వర్

ఆదిలాబాద్‌టౌన్: ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మడావి గణేష్, ముఖ్య కార్యదర్శులు నాగేందర్, ఆత్రం అశోక్, బండు, యువరాజ్, జలపత్, విట్టల్‌లు గురువారం పీడీఎస్‌యూలో చేరారు. పట్టణంలోని కుమురంభీం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్నారపు రాజేశ్వర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జగజంపుల తిరుపతి వారికి సంఘం కండువాలు కప్పి స్వాగతించారు. పీడీఎస్‌యూ సంస్థాగత ఆశయాలు, సిద్ధాంతాలు నచ్చి సంఘంలో చేరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పెండింగులో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరీష్, శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రజలు, రైతులకు బ్యాంకు సేవలు, భీమా పథకాలపై అవగాహన ఉండాలని నాబార్డు ఎఫ్ఎల్‌సీ లోక రాంరెడ్డి, ఇంద్రవెల్లి ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ మెస్రం కోసేరావ్‌లు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సదస్సును గురువారం మండలంలోని పిట్టబొంగరం గ్రామంలో నిర్వహించారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష భీమా యోజన, ఆటల్ పెన్షన్ యోజన, జన్‌ధాన్ ఖాతాలు, కేసీసీ, పీఎం కిషన్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెట్టి గంగా జాకేశ్వర్, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపు


వంట చేసేందుకు సరుకులు సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

- నాలుగు నెలలుగా రాని మధ్యాహ్న భోజన బిల్లులు
- పెరిగిన సరుకుల ధరలు
- చెల్లించాలని నిర్వాహకులు వేడుకోలు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వహణ భారంగా మారింది. నాలుగు, ఐదు నెలలుగా కూరగాయలు, వంట సరుకులు, కోడిగుడ్ల బిల్లులు రాక నిర్వాహకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, లక్కారం జిల్లా పరిషత్ పాఠశాల, ఉర్దూ పాఠశాలలతో పాటు ఆయా గ్రామాల్లో పాఠశాలలకు మధ్యాహ్న భోజన బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

తప్పని తిప్పలు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద అందిస్తున్న వంట సరుకులు, కూరగాయలు, కోడిగుడ్ల బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. నాలుగు ఐదు నెలలుగా ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల పిల్లలకు కోడిగుడ్లు అందిస్తున్నప్పటికీ బిల్లులు రాక పోవడంతో వారికి తిప్పలు తప్పడం లేదు. అప్పు చేసి దుకాణాల నుంచి సరుకులు కొనుగోలు పిల్లలకు భోజనం అందిస్తున్నారు. అంతే కాకుండా నూనె, వంట సరుకులు, గుడ్ల ధరలు పెరగడంతో గిట్టుబాటు అవడం లేదని అంటున్నారు. ఆర్థిక భారం తమపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సరుకుల రేట్లు పెరిగాయి



రోజు రోజుకూ నిత్యావసర సరుకుల రేట్లు పెరగడంతో ఆర్థిక భారం పడుతోంది. దుకాణాల్లో అప్పు సప్పు చేసి సరుకులు తీసుకువచ్చి వంటలు చేస్తున్నాం. నెలల తరబడి ఎవరూ సరుకులు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలి.
– రాధమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

నెలనెలా బిల్లులు చెల్లించాలి



బిల్లులు సక్రమంగా రాక దుకాణాల్లో అప్పు చేసి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. రేపో మాపో బిల్లులు వస్తాయని సరుకులు తీసుకువస్తున్నాం. దుకాణదారులు కూడా సరుకులు ఇవ్వడం లేదు. పిల్లలకు భోజనాలు పెట్టేందుకు ఇబ్బంది పడుతున్నాం.
– గంగమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

నేటి నుంచి ధ్యాన కేంద్రం వార్షికోత్సవం


కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

బోథ్: మండలంలోని పట్నాపూర్ పరిధిలోని ఇంకర్‌పల్లెలోని పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన్య కేంద్రం 16వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నుంచి 6తేదీ వరకు నిర్వహించనున్నట్లు ధ్యాన కేంద్ర కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం వార్షికోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్ర అధ్యక్షుడు ఆడెం నాగోరావ్ పటేల్, ఆడెం జుగాదిరావు, పంద్రం శ్రీరాం, పంద్రం శంకర్, సార్మెడి ఆడెం భీంరావ్, గోపాల్ పాల్గొన్నారు.